క్లుప్తంగా

స్టేషనరీ వితరణ



అన్నంపేటలో స్టేషనరీ అందజేస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని అన్నంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మామిడి సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు రవికుమార్, కిరణ్‌కుమార్ స్టీల్ ప్లేట్లు, బుక్స్, స్టేషనరీని గురువారం పంపిణీ చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మామిడి ఆదినారాయణ, పరిడాల రవి, గణేష్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ వాలీబాల్ పోటీలకు ఎంపిక



వినయ్‌తో పీఈటీ జ్యోతీరాణి

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.వినయ్‌కుమార్ నేషనల్ వాలీబాల్ టీమ్‌కు ఎంపికయ్యాడు. 68వ స్కూల్ గేమ్స్‌లో భాగంగా రాష్ట్ర స్థాయిలో బోగాపురంలో ఇటీవల వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా వాలీబాల్ టీమ్‌కు వినయ్ కెప్టెన్‌గా ఉంటూ ప్రథమ స్థానంలో నిలిపాడు. స్టేట్ టీమ్‌కు కూడా కెప్టెన్‌గా నియమించినట్లు ఉర్లాం స్కూల్ పీఈటీ జ్యోతీరాణి, హెచ్‌ఎం హర్షవర్ధన్ శర్మ తెలిపారు. వినయ్‌ను గురువారం స్కూల్ వద్ద అభినందించారు. వినయ్ విజయంలో తండ్రి నాగభూషణరావు కృషి ఉందని పీఈటీ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి డివిజన్ ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. రావిచంద్రి వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు.

మెనూ తప్పనిసరి

మెళియాపుట్టి: మెనూ తప్పనిసరిగా పాటించాలని సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నేలబొంతు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. మెనూ, తరగతి గదులు, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. హెచ్‌ఎంతో మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన ఉండాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని, ప్రతీరోజు మరుగుదొడ్లు పరిశుభ్రం చేయించాలని సూచించారు. పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి

సారవకోట: విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని సవరబొంతు ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. రానున్న 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని, గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.

108 సిబ్బంది నిరసన



సరుబుజ్జిలి: నిరసన తెలియజేస్తున్న 108 సిబ్బంది

సరుబుజ్జిలి: కూటమి ప్రభుత్వం 108 ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరు దారుణమని 108 సర్వీస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు టి.విజయ్‌మోహన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో 108 సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపనందున ఈ నెల 25 నుంచి తమ సిబ్బంది మొత్తం సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. 108 సిబ్బంది వెంకటేష్, ఈశ్వర్, మురళి, అమ్మినాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జలుమూరు: తమ సమస్యలు పరిష్కరించాలని 108 ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలల వేతన స్లాబ్ అప్‌డేట్ చేయాలని, పని గంటలు 12 నుంచి 8 గంటలకు మార్చాలని, పీఎఫ్ మొత్తం యాజమాన్యం నుంచి వసూలు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో డి.మురళీధర్, జి.రామకృష్ణ, ఎం.బాలరాజు, ఆర్.రమేష్‌బాబు, టి.రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

ప్రీమియం చెల్లిస్తేనే.. పరిహారం

- రైతులపై ఇన్సురెన్స్ ప్రీమియం భారం
- అడ్రస్‌లేని అన్నదాత సుఖీభవ
- కూటమి ప్రభుత్వంపై రైతుల మండిపాటు

పాతపట్నం నియోజకవర్గంలో సాగుభూమి (హెక్టార్లు) వివరాలు ఇలా..

మండలం	సాగుభూమి	రైతులు
పాతపట్నం	8,699	14,726
హిరమండలం	3,364	6,716
కొత్తూరు	10,374	13,914
మెళియాపుట్టి	7,741	12,235
ఎల్.ఎన్.పేట	4,464	8,487



హిరమండలం ప్రాంతంలో వేసిన మొక్కజొన్న పంట

హిరమండలం: అధికారంలోకి వచ్చాక అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ.20 వేలు రైతు ఖాతాల్లో జమచేస్తామని మాట ఇచ్చిన కూటమి సర్కార్ ఆ హామీని ఇంతవరకు నెరవేర్చలేదు. రైతులపై అదనంగా ఇన్సురెన్సు ప్రీమియం భారం మోపేందుకు సిద్ధమైంది. రైతులకు రబీ సీజన్ నుంచి కూటమి ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. వ్యవసాయంతోపాటు ఇతర పంటలు పండిస్తున్న రైతులకు గత ప్రభుత్వం ఎంతో అండగా నిలిచింది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా పరిహారం అందించింది. కూటమి ప్రభుత్వం ఈ పథకానికి తూట్లు పొడుస్తోంది. ఇకపై తుఫాన్, ఇతర ప్రకృతి వైపరీత్యాల సమయంలో బీమా అందాలంటే నోటిఫైడ్ చేసిన పంటలకు సంబంధించిన బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించుకోవాలని ప్రకటన చేసింది. దీంతో రైతన్నలు కూటమి సర్కార్‌పై మండిపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచిత బీమా అమలు

ఏటా ప్రకృతి విపత్తుల నుంచి రైతులు నష్టపోతున్నారు. కొన్ని సందర్భాల్లో బీమా చెల్లించుకోకపోవడంతో తుఫాన్ సమయంలో వచ్చిన నష్టపరిహారం అందుకోలేకపోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నదాతల కోసం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ-క్రాప్ విధానంతో ప్రతీ రైతు వివరాలు నమోదు చేసి వారికి ఉచితంగా పంటల బీమా వర్తింపజేశారు. వరికి రూ.600, ఉద్యావన పంటలైన జీడి, మామిడికి సుమారు నాలుగు వేల రూపాయల బీమా ప్రీమియం చెల్లించాలి. ఆ మొత్తం గత ప్రభుత్వమే చెల్లించేది. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బీమా విషయంలో దీమాగా ఉండేవారు. దీనికి తోడు పెట్టుబడి సాయం కింద ప్రతి ఏటా రైతుల ఖాతాలో రూ.13,500 జమ అయ్యేది.

డిసెంబర్ 15వ తేదీ తుది గడువు..

ఈ ఏడాది రబీ సీజన్ నుంచి ఇన్సురెన్స్ ప్రీమియం చెల్లించాలంటూ కూటమి ప్రభుత్వం మరోమారు రైతులకు ఇబ్బంది పెట్టేందుకు సిద్ధమైంది. ప్రీమియం చెల్లించేందుకు డిసెంబర్ 15వ తేదీ తుది గడువు విధించింది. రుణాలను రెన్యువల్ చేసుకుంటే తప్ప.. ప్రీమియం కట్టించుకోమని బ్యాంకర్లు చెబుతుండటంతో రుణాలు చెల్లింపు రైతులకు భారంగా మారింది. అసలే అప్పులు చేసి పంటలు సాగు చేశాం.. ఇప్పుడు రుణాలను ఎలా రెన్యువల్ చేయగలమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్ణయం వెనక్కు తీసుకోవాలి



వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దుచేసే నిర్ణయాన్ని తక్షణమే కూటమి ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలి. ఈ పథకం వలన రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బీమా నమోదు జరిగేది. ఇప్పుడు రైతులే ప్రీమియం చెల్లించుకోవాలని ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రైతులకు భారం కానున్న ఇటువంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– లుకలాపు శ్రీనివాసరావు, రైతు, కిట్టాలపాడు

ప్రీమియం చెల్లింపు అదనపు భారం



గత ఐదేళ్లు పంటసాగుకు ముందే పెట్టుబడి నిధి అందుకున్న రైతులకు కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆ సాయం అందకుండా పోయింది. దీంతో అప్పులు చేసి పంట సాగు చేపట్టాం. ఇన్సురెన్సు ప్రీమియం కూడా గత ప్రభుత్వమే చెల్లించగా.. కూటమి ప్రభుత్వం రైతులనే కట్టమంటుంది. అసలే ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఇప్పుడు ప్రీమియం చెల్లింపు అనేది అదనపు భారంగా మారింది.

– బి.వెంకటరమణ, రైతు, తంప గ్రామం, హిరమండలం మండలం

చర్చి పక్కనే వైన్‌షాప్ !



సరుబుజ్జిలి మండల కేంద్రంలో పెంతుకోస్ట్ చర్చిపక్కనే వైన్ షాపు ఏర్పాటు చేయడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చర్చికి అతి సమీపంలో శివాలయం కూడా ఉంది. పాలకొండ ఆర్‌అండ్‌బీ రహదారిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. సాయంత్రం వేళలో మందుబాబుల చిందులతో విద్యార్థులు ఈ దారిలో వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. వైన్‌షాపు జనావాసాలకు సమీపంలో ఏర్పాటు చేయడంతో రాత్రి సమయంలో ఇబ్బందులు వస్తున్నాయని నందికొండ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- సరుబుజ్జిలి

పడిగాపులు..



సారవకోట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం దగ్గర పడిగాపులు కాస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలు, పాఠశాలలో అపార్ నమోదు చేస్తున్నారు. దీనికి ఆయా కళాశాల, పాఠశాలల రికార్డులలో నమోదైన పుట్టిన తేదీ, ఆధార్‌లో ఉన్న తేదీ ఒకేలా ఉండాలి. చాలా మంది విద్యార్థుల వివరాల్లో తేడాలు ఉన్నాయి. ఆధార్ కార్డులలో పుట్టిన తేదీ మార్చాలంటే సరైన ధ్రువపత్రం ఉండాలి. పుట్టిన తేదీకి సంబంధించిన ధ్రువ పత్రాలు కావాలంటే తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఇక్కడి నుంచి ఆర్డీఓ కార్యాలయానికి దరఖాస్తు వెళ్లిన తరువాత ధ్రువపత్రం మంజూరు చేస్తారు.

- సారవకోట

షెడ్ల నిర్మాణం అడ్డగింత



ఐరెన్ రాడ్లు వేస్తున్న కూలీలు

నరసన్నపేట: స్థానిక లక్ష్మీ టాకీస్‌కు ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలంలో గురువారం రేకుల షెడ్లు వేయడానికి కొందరు ప్రయత్నించగా అధికారులు అడ్డుకున్నారు. ఈ స్థలంలో ఉన్న భవనాలను రెవెన్యూ అధికారులు రెండేళ్ల క్రితం తొలగించారు. అప్పటి నుంచి ఈ స్థలం ఖాళీగానే ఉంది. ఈ స్థలంలో గతంలో భవనాలు నిర్మించిన వ్యక్తి నెలకు రూ.40 వేల చొప్పున ప్రస్తుతం ఇతరులకు మూడు నెలలకు లీజుకు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వారు రేకుల షెడ్లు వేసి వస్త్ర దుకాణాలు పెట్టేందుకు ప్రయత్నించగా.. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సత్యనారాయణ, పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని వెంటనే స్పందించి పనులను నిలిపివేయించారు. ఆర్ఐ సాయిరామ్, వీఆర్వో లక్ష్మణరావు తదితరులతో కలిసి ఈఓ స్థలం వద్దకు వెళ్లి పనులను పరిశీలించారు. పనులు చేయవద్దని, ప్రస్తుతం వేసిన ఐరెన్ రాడ్లు తొలగించాలని వ్యాపారులకు ఆదేశించారు. తొలిగించేందుకు సాయంత్రం వరకు సమయం కావాలని వ్యాపారులు గడువు కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఈఓ మాట్లాడుతూ ఈ స్థలం ఆర్‌అండ్‌బీదని, దీనిపై కోర్టు కేసు నడుస్తోందని, దీంట్లో ఎటువంటి నిర్మాణాలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆధార్ సమస్యలు పరిష్కరించండి



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ, ఎంపీడీఓ, తదితరులు

నరసన్నపేట: విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కల్పించే అపార్ కార్డుల మంజూరు చేయడానికి ఆధార్ సమస్యలు ఉత్పన్నమైతే వాటిని త్వరితగతిన పరిష్కరించాలని జెడ్పీ సీఈఓ ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజా అన్నారు. అపార్ అప్‌లోడ్ ఎలా ఉందనే దానిపై ఎంపీడీఓ మధుసూదనరావు, ఎంఈఓలు దాలినాయుడు, శాంతారావుతో గురువారం సమీక్ష చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. మండలంలో పలు ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో అపార్ అప్డేట్ చాలా నెమ్మదిగా ఉందని, దీని వలన జిల్లా ఏవరేజ్ తగ్గుతుందని, పైఅధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. మండల కేంద్రంలోని సంపత్ సాయి ప్రైవేట్ కాలేజీ, నారాయణ స్కూల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

● నవభారత నిర్మాత నెహ్రూ

ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటాలకు నివాళులర్పించారు. నవభారత నిర్మాత నెహ్రూ అని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు చిన్నారులు నెహ్రూ వేషధారణలో ఆకట్టు కున్నారు. పలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

- సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: తమ్మినేని సీతారామానుజాచార్యులు సమకూర్చిన వేమన శతకం పుస్తకాలతో విద్యార్థులు



ఆమదాలవలస: భవిత పాఠశాలలో అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన



పొందూరు: భాష్యం స్కూల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు



జలుమూరు: లింగాలవలస స్కూల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



ఎల్.ఎన్.పేట: శ్రీనివాసనగర్‌లోని టెస్ కార్యాలయం వద్ద నెహ్రూ చితపటానికి పూలమాల వేస్తున్న కార్యదర్శి సుజాత, తదితరులు



పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



కొత్తూరు: పాతపానుగూరు యూపీ పాఠశాలలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులు



నరసన్నపేట: నడగాం యూపీ స్కూల్లో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



హిరండలం: గొట్టా ఎంపీయూపీ స్కూల్లో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పొందూరు: ఎంపీపీ స్కూల్-1లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జడ్జి బి.జ్యోత్స్న



సారవకోట: శాఖా గ్రంథాలయంలో బాలలతో ఎంఈఓ రమణ, లైబ్రేరియన్



సరుబుజ్జిలి: మూడడ్ల సత్యనారాయణ సమకూర్చిన ఐడీ కార్డులతో రొట్టవలస జెడ్పీ స్కూల్ విద్యార్థులు

విద్యార్థులకు అభినందన

జలుమూరు: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారు. రోటరీ క్లబ్ ఆమదాలవలస, కాసుల చిత్రకళ అకాడమీ (హైదరాబాద్) సంయుక్తంగా నిర్వహించిన రామయణం చిత్ర లేఖనం అంతర్జాతీయ పోటీలలో పాల్గొని సత్తా చాటారు. గురువారం పాఠశాల ఆవరణలో బి.లోలాక్షి, కరిష్మా(10వ తరగతి) జి.దివ్య (9వ తరగతి), ఎం.శ్రీధర్(6వ తరగతి)లను అభినందించారు. హెచ్‌ఎం ఇప్పిలి వేణుగోపాలరావు, రోటరీ క్లబ్ ఆమదాలవలస అధ్యక్షురాలు పి.తేజలక్ష్మి, రోటరీ పెద్దలు పాత్రుని పాపారావు, రవి కుమార్, ప్రతాప్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కబడ్డీలో బంగారు పతకం



జలుమూరు: చందరరావును అభినందిస్తున్న హెచ్‌ఎం రఘునాథరావు, ఉపాధ్యాయులు

జలుమూరు: కబడ్డీలో బంగారు పతకం సాధించిన యలమంచిలి ఉన్నత పాఠశాల విద్యార్థి వాన చందరరావును ఉపాధ్యాయులు, గ్రామస్తులు గురువారం అభినందించారు. ఇటీవల గుంటూరు జిల్లా బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో బంగారు పతాకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హెచ్‌ఎం జి.రఘునాథరావు, పీడీ పి.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో సత్తా..



పొందూరు: ప్రతిభ కనబరిచిన విద్యార్థినుతో ఉపాధ్యాయులు

పొందూరు: మండలంలోని పిల్లలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 9 నుంచి 11 వరకు కృష్ణా జిల్లా పటమటలో జరిగిన అండర్-17 హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొన్న (శ్రీకాకుళం జట్టులో) జి.అఖిల, జి.సుస్మిత, ఎల్.పావని సత్తా చాటారు. శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానం సాధించింది. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఎస్.కాసులుబాబు, పీడీ రాజశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



మెళియాపుట్టి: గ్రంథాలయంలో నెహ్రూ, సరస్వతీదేవి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంఈఓ దేవేంద్రరావు, తదితరులు

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని వక్తలు అన్నారు. గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



బూర్జ: శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆమదాలవలస: బొడ్డేపల్లిపేట శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీప్రసాద్, తదితరులు



జలుమూరు: తిలారు రైల్వే స్టేషన్‌లో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న రావిపాడు ఎంపీటీసీ బి.సింహాచలం



కొత్తూరు: శాఖా గంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ నీరజ, తదితరులు

బకాయి వేతనాలు చెల్లించండి

నరసన్నపేట: ఐదు నెలలుగా బకాయిపడిన వేతనాలు చెల్లించాలని మండలంలో 82 స్కూళ్లల్లో పనిచేస్తున్న ఆయాలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయాలు కోరుతున్నారు. ఎంఈఓలను కలిసేందుకు గురువారం నరసన్నపేటకు వచ్చారు. గత ప్రభుత్వ కాలంలో నెల వారీ వేతనాలు రూ.6 వేల చొప్పున ఖాతాల్లో పడేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంతవరకు వేతనాలు ఇవ్వలేదన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఎస్టీయూ శాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి రమణమూర్తి అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమస్యలు పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉపాధ్యాయులకు నిరాశ ఎదురైందన్నారు. రెండు రోజుల క్రితం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే దిశగా కేటాయింపులు జరగలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఏ ఎరియర్స్, ఐఆర్‌లపై స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండల ఎస్టీయూ నాయకులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.